# జగన్నాథ పండితరాయలు



యర్రమిల్లి ప్రభాకరరావు

Copyright © 2020, Y. Prabhakara Rao
All rights reserved.
No part of this publication may be reproduced or transmitted in any form or by any means, electronic or mechanical, including photocopy, recording or any information storage and retrieval system now known or to be invented, without permission in writing from the publisher, except by a reviewer who wishes to quote brief passages in connection with a review written for inclusion in a magazine, newspaper or broadcast.

Published in India by Prowess Publishing,
YRK Towers, Thadikara Swamy Koil St, Alandur,
Chennai, Tamil Nadu 600016

ISBN: 978-1-5457-5351-4

Library of Congress Cataloging in Publication

# జగన్నాథ పండిత రాయలు

పవిత్ర గోదావరీ పరీవాహక ప్రాంతానికి కొంగుబంగారం కోనసీమ. ఆ క్షేత్ర హృదయసీమ నలంకరించిన శమంతకమణి మునిఖండగ్రామం. త్రేతాయుగము నాటి తపోనిష్ఠాగరిష్ఠులైన బ్రహ్మజ్ఞుల పాదస్పర్శచే పునీతమైన ధర్మక్షేత్రం. బ్రహ్మర్షి విశ్వామిత్ర మునీంద్రుని ఆజ్ఞను శిరోధార్యము చేసి అఖండ గోదావరిలోని ఏడుపాయలలో ఒకటిగా ప్రవహించిన కౌశిక నదీ తరంగాలతో హృద్యమంగా, శోభాయమానంగా, పాడిపంటలతో అలరాడుతున్న సాటిలేని మేటిగ్రామం మునిఖండం.

ఆ గ్రామం ఋషి పుంగవుల పాదపద్మ పరాగ సంజాత. శ్రీ ఉమా మూలేశ్వరస్వామి మునిఖండంలో వేంచేసిన క్షేత్రస్వామి. ఆ స్వామి కరుణాకటాక్ష వీక్షణాలతో ఆ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంది. తల్లి భువనేశ్వరీదేవి చల్లని దృక్కులు ఆ గ్రామ ప్రజలను ఎల్లవేళలా కాపాడుతూ ఉంటాయి.

మూలేశ్వరస్వామిని ప్రతిష్ఠించిన సాంఖ్యాయన మహర్షి పేరు సంతరించుకొని సాంఖ్యాయన నది ఆ గ్రామాన్ని పునీత చరితను గావించింది.

గ్రామంలోకి వెళ్ళే మార్గానికి ఇరువైపులా పెద్దపెద్ద వృక్షాలు చింత, సీమచింత, రావి, మర్రి, నేరేడులే కాక అక్కడక్కడ జామ, మామిడి, పనసచెట్టు కూడా చూపరులకు ఆహ్లాదం కల్గిస్తున్నాయి. ఆ చెట్లు ఫలపుష్ప భరితములగుటయే కాక బాటసారులకు మండు వేసవిలో పుష్కలంగా నీడను ఇస్తున్నాయి.

*   *   *

ఉషోదయమైనది. ఆ దినమున బ్రాహ్మీ ముహూర్తమునే శీతల గోదావరి నదీతరంగ స్నానమాచరించి, ప్రాతఃసంధ్యాది క్రియలాచరించి పయనైదు పదునార్గురు శిష్యులతో వడివడిగా గ్రామంవైపు అడుగులు వేస్తున్నాడు ఒక ద్విజుడు.

“పేరుభట్టా మహాశయులకు వందనాలు. ఈరోజు తమరాక కాలాతీతమైనదా! అందుకే కాబోలు గోదావరీమాత కల్లోల పడినది” అని నమ్రతతో పృచ్ఛించాడు ఒక గృహస్థుడు.

“లేదు స్వామీ! సకాలంలోనే తల్లిని దర్శించాము. వర్షఋతువు కదా! తల్లి నిండు హొయలతో నృత్యము చేస్తూ ప్రవహిస్తోంది. ఆ కమనీయ దృశ్యమును కనులారా చూసు భాగ్యము కలిగినది. ఎంత దనుక చూసిననూ తనివి తీరదు కదా!” అన్నాడు శిష్యులలో ఒకడు.

పేరుభట్టారకుడు మందహాసం చేసాడు. తన ప్రక్కనే నడుస్తున్న శిష్యుని భుజంపై ఆప్యాయంగా చేయివేసి “కుమారా! రేవానదీ తీరాన తపమాచరిస్తే ముక్తి వస్తుంది. జాహ్నవీ తీరాన తనువు చాలిస్తే ముక్తి లభిస్తుంది. కురుక్షేత్రంలో దానం చేస్తే మోక్షప్రాప్తి కలుగుతుంది. ఇక మన గోదావరిలో స్నానమాచరిస్తే ఆ మూడు పుణ్యాలు పొందుతామని శాస్త్రాలు చెబుతున్నాయి. అటువంటి గోదావరీ స్నాన మహాభాగ్యాన్ని వదులుకొంటాడా ఈ పేరుభట్టు. అందునా మునిఖండంలో నివసిస్తూ...” గట్టిగా నవ్వాడు. చురుకుగా ముందుకుసాగాడు.

శిష్యబృందం ఆయన వెనకే పరుగులు తీసారు. పిల్ల తెమ్మెరలు వారికి వింజామర వీస్తున్నాయి. ప్రాగ్దిశన సూర్యభగవానుడు తన జైత్రయాత్రను ఆరంభించాడు.

ఆ గృహం ప్రకృతికి నిలయం. ఉత్తరముఖంగా గోదావరిని చూస్తుంది. నలువైపులా అరుగులు. ఈశాన్యమున మూలదేవతార్చనాగది. తూర్పుదిశన భోజనశాల. ఆగ్నేయమున పాకశాల. దక్షిణాన వరండా... నైఋతి దిశన పడకగది. పడమరవైపు వరండా. వాయవ్యాన వాస యోగ్యమైన మరొక ఆరామము. దానికి దాపునే ధాన్యకొట్టాలు. ముఖ, హస్త, పాద ప్రక్షాళన చేసుకొనేందుకు కూడ సదుపాయంగానే ఉన్న ఆ మండువాలోగిలి సింహద్వారము అతిథులను ఆహ్వానిస్తున్నట్లుగా ఎల్లవేళలా తెరిచియే ఉంటుంది. ఇంటికి దక్షిణంగా గోశాల. ఆ దాపునే పశువుల మేత కొట్టాలు. ఇంటిగోడలు, వాసాలు, అడుసుమన్నుతో నిర్మితము. నేల గోమయంతో అలికినది. ఇంటిచుట్టూ ముగ్గులు. గడపలకు పసుపు. రెల్లుగడ్డితో ఆచ్ఛాదితమైన ఇంటికప్పు ఒక ప్రత్యేకత, నిరాడంబరతకు చిహ్నం.

ఇంటికి నలువైపులా స్థలం. అందులో ఒకవైపు కూరగాయ మొక్కలు బీర, బెండ, వంగ, దొండ, ఆనప, పొట్ల పాదులు. వెనుకవైపు సపోట, సీతాఫల, జామ, నారింజలు. ఇంకొంతదూరం సపోట, మామిడి, పనస, అరటిచెట్లు. ముందుభాగాన సన్నజాజి, విరజాజి, మల్లెమాలతి, మంకెన, చంద్రకాంత, కనకాంబర, సంపెంగ, మందార ఇత్యాది పూబాలలు. వన్నెచిన్నెలు ఒలికిస్తూ, సప్తవర్ణాలను పరావర్తనంచేస్తున్న మాలాతోరణాలు ఆహ్వానం పలుకుతున్నట్లుగా చూపరులను సమ్మోహనం చేస్తున్నాయి. కమ్మని సువాసనలు వెదజల్లుతున్నాయి. గృహిణులు అర్చించుటకు వీలుగా ఇంటి వెనుకభాగాన తులసీ సమన్విత మంటపము. అది పాలరాయి నిర్మితము. పక్షులు కిలకిలారావాలతో, తేనెటీగల ఝూంకార నాదాలతో, గోమాతల అంభారావాలతో ఆ గృహం నాదయుక్త వేదశాలలా భానిస్తోంది.

*  *  *

ఆ పటకుటీర స్వామి పేరుభట్టు. పేరుభట్టు వేగినాటి బ్రాహ్మణుడు. కౌండిన్య గోత్రుడు, ఉపద్రష్ట వంశజుడు, వేదపండితుడు, శ్రౌత స్మార్తాలను కరతలామలకం చేసుకున్న ధీశాలి. సకలశాస్త్ర కోవిదుడు. కూచిపూడి నాట్యాచారుడు. సంగీత నిధి, కాశీ పండితులలో అగ్రేసరుడై భాసిల్లినవాడు. జ్ఞానేంద్ర భిక్షువు వద్ద వేదాంతశాస్త్రం, మహేంద్రుని వద్ద న్యాయ వైదేశికాలు, ఖండదేవుని వద్ద పూర్వమీమాంస, శేష శ్రీకృష్ణ పండితుని కుమారుడైన శేషవీరేశ్వరుని వద్ద వ్యాకరణం అధ్యయనం చేసాడు. సకల శాస్త్రాచార్యుడై అమేయ కీర్తి ప్రతిష్ఠలు కైవసం చేసుకున్నాడు. నిత్యకర్మానుష్ఠాయి. ఐదుపదులు పైబడినవాడు. నిర్మల హృదయుడు, స్వచ్ఛత, నిరాడంబరత ఆయన పాండిత్య గరిమ, సునిశిత ధీశక్తులకు వన్నె తెస్తున్నాయి.

ఆ ధార్మికుడు ఐదుబారల పంచె, అటువంటిదే ఉత్తరీయం ధరిస్తాడు. నొసట విభూతిరేఖలు, తిలకము భాసిస్తాయి. దర్భలతో చేయబడిన ఉంగరము ధరిస్తాడు. మెడలో రుద్రాక్షమాల, భుజముమీద నుండి వక్షస్థలం మీదుగా అలంకృత యజ్ఞోపవీతము. పాదములను ఆచ్ఛాదిస్తూ పాంకోళ్ళు ఆయన అలంకారాలు.

పేరుభట్టు ధర్మపత్ని లక్ష్మీదేవి. ఆమె కూచిపూడివారి ఆడబడుచు. భర్తకు అన్నివిధములా దీటైన భార్య ఆయన అడుగుజాడలలో నడుస్తుంది. భర్తయే ఆమె లోకం. ఏడుబారల చీర, రవిక తెలుగు ఆడపడుచుల పద్ధతిలో ధరిస్తుంది. మెడలో ఒంటిపేట చంద్రహారం, చేతులకు రెండు జతల గాజులు, చెవులకు దుద్దులు, ముక్కుపుడక బంగారంతో చేసినవి ఆమె ఆభరణాలు. మెడలో నల్లపూసలు, మంగళసూత్రాలు, కాళ్ళకు మట్టెలు ఆమె తెలుగింటి ముత్తైదువని చెప్పకనే చెబుతాయి. ఆమె పూచిన తంగేడు. నలభై పైబడినా ఆమె మేని బంగారువన్నె తగ్గలేదు. నొసట కుంకుమ, మోమున పైపూతగా పసుపు, కన్నులకు కాటుక, సిగలో మందారం ఆమె సహజ అలంకారాలు. ఆమెకు భర్తయే విష్ణుమూర్తి. గృహమే వైకుంఠధామం. ప్రతిదినం భర్తకు భగవదారాధనా గృహంలో పూజాద్రవ్యాలు సమకూర్చటం, అధ్యయన మంటపంలో వ్యాసపీఠం అమర్చి తాళపత్ర గ్రంథాలు అందుబాటులో ఉంచడంతో ఆమె దైనందిన కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. వంచిన నడుము ఎత్తకుండా ఇంటిపనిలో మునిగి తేలుతుంది. ఆ పిదప స్నానమాచరించి గోదావరికి పోయి ఆయనకు పరిశుద్ధమైన రాగిబందెతో మంచినీరు తేవాలి. గోమాతల నుండి పాలు పితకాలి. నిష్ఠాగరిష్ఠురాలై శాకపాకాదులు వండడం దగ్గరనుంచి వెన్నతీయడం, నేయి కాచడం, వడ్లు దంపించటం, పప్పులు చేసుకోవడం, ఆమె నిత్యకృత్యాలలో కొన్ని మాత్రమే. ఈ పనుల ఒత్తిడిలో ఆయన వస్త్రాలను శుభ్రపరచడం, శయన తల్పాన్ని అమర్చడం మరువదు.

ఇంతేకాదు పేరుభట్టు శిష్యులు – అంతేవాసులు పదిహేను, ఇరవైమంది ఉంటారు. వారు గురు శుశ్రూష చేస్తూ వేదాలు, శాస్త్రాలు అధ్యయనం చేస్తూ ఉంటారు. వారందరూ ఆశ్రమవాసులే. వారి భోజన, నివాస సౌకర్యాలు పేరుభట్టు చూస్తూ ఉంటాడు. వారికి ఆవాస యోగ్యమైన వేరే గృహం ఏర్పాటు చేసాడు పేరుభట్టు. వాళ్ళు స్వయంపాకం చేసుకునేందుకు ఏర్పాట్లన్నీ లక్ష్మీదేవే చేయాలి. ఆమెను తల్లిగా భావిస్తారు ఆ విద్యార్థులు. ఆమె వారిని బిడ్డలుగా సాకుతుంది.

పేరుభట్టు విద్యాభ్యాసానంతరం కాశీనుండి భార్యతో మునిఖండం – స్వగ్రామం వచ్చివేసాడు. ఆయనకు స్వగ్రామం అంటే అంత అభిమానం. వైదిక ధర్మావలంబియై గార్హ్యస్థాశ్రమం స్వీకరించాడు. అప్పుడు ఆయన వయస్సు ఇరవై సంవత్సరాలు. లక్ష్మీదేవి షోడశ సంవత్సరముల బాలికే.

ఆ కాలము పదిహేనవ శతాబ్ద తొమ్మిదవ దశకం. వంశపారంపర్యా వచ్చిన అగ్రహారం పేరుభట్టుకు ఆసరా. సంపన్నుడు కాకపోయినా రోజులు చీకుచింతా లేకుండా గడుస్తున్నాయి. దూరతీరాల నుండి విద్యాభ్యాసం కోసం శిష్యులు వస్తున్నారు. వారి అవసరాలు కూడా చూస్తున్నాడు పేరుభట్టు. వారిలో కొంతమంది గురుదక్షిణ కూడా సమర్పిస్తున్నారు. కాబట్టి ఆర్థిక సమస్యలు ఆయనను అంతగా బాధించడంలేదు.

ఆయన రాళ్ళనుండి అమృతం చిందించే కవిత్వం చెప్పగలిగిన దిట్ట. ప్రాకృత, సంస్కృత, తెనుగు, హిందీ, కన్నడ, మరాఠీ భాషలు ఆయనకు కరతలామలకాలు. వేదపండితుడు. ఆప్రాంత ఏలికలు ఆయనను గౌరవిస్తున్నారు. నోరు తెరిచి అడగనవసరం లేకుండానే ఆయనకు కావలసిన ఆర్థిక సహాయం చేస్తున్నారు. కర్షకులు, వణిజులు సంబారాలను సంతోషంతో సమర్పిస్తున్నారు. కాలం గడిచిపోతోంది ఏలోటూ లేకుండా.

పేరుభట్టుకు ప్రథమ సంతానం కలిగింది. సుపుత్రోదయంతో భార్యాభర్తల ఆనందానికి మితిలేదు. ఆ బిడ్డకు జగన్నాథుడని నామకరణం చేసాడు పేరుభట్టు. తరువాత ఐదు సంవత్సరాలకు వారికి ద్వితీయ పుత్రుడు కలిగాడు. ఆ కుమారునికి రామచంద్రభట్టు అని పేరుపెట్టాడు.

ప్రస్తుత కథాకాలం నాటికి జగన్నాథునికి ఇరువది సంవత్సరముల ప్రాయం. అనగా కాలప్రవంతిలో క్రీ॥శ॥ 1610 సం॥ జరుగుతోంది.

*          *          *

## – 2 –

జగన్నాథుడు బాల్యం నుండి తండ్రికి తగిన తనయుడిగా భాసించాడు. పేరుభట్టు జగన్నాథునికి ఎనిమిదవ యేటనే ఉపనయన సంస్కారం చేసాడు. బ్రహ్మోపదేశం చేసాడు. ఆనాటి నుండి జగన్నాథుడు సూర్యోదయానికి పూర్వమే నిదురలేచేవాడు. తండ్రి గోదావరీ స్నానం చేసి వచ్చేటప్పటికి తానుకూడా గృహమునందే స్నానాదికాలు పూర్తి చేసుకునేవాడు, గురుకులంలోనే శిష్యులతోపాటు సంధ్యాదులు ముగించుకొని. పేరుభట్టు కుమారునిచే ఋగ్వేదం వల్లెవేయించేవాడు, తన శిష్యులతో పాటు. ఇసుకపై అక్షరాభ్యాసం చేసిన నాటినుంచి చూపుడి వ్రేలితో సంస్కృతాక్షరాలు దిద్దించేవాడు. చిన్నతనంలోనే గళం లొంగుతుంది. స్వరం కుదురుతుంది. కాబట్టి వేదపారాయణం చేయించేవాడు. సంగీతశాస్త్రంలో అభినివేశం కల్గించాడు. జగన్నాథుడు శుచిగా, నిష్ఠగా వేదాధ్యయనం, సంగీత, కావ్య, నాటకాలంకారాలు, వ్యాకరణ శాస్త్రాలు క్రమశిక్షణా పూర్వకంగా అధ్యయనం చేసాడు.

కాలంతోపాటు జగన్నాథుని ప్రాయం కూడా పరువెత్తుతోంది. ఆ ఒరవడిలో అతడు వయస్సులో తనకంటే పెద్దవారైన విద్యార్థులతో విద్యావిషైక స్పర్థలలో మునిగి తేలేవాడు. నిరంతర అధ్యయనం అతని క్రీడ. గృహమే గురుకులము. గురుకులమే గృహము. తండ్రియే గురువు. గురువే తండ్రి. గురువు చెప్పిన పాఠాలు వల్లెవేయడం, వేదపారాయణం తనతోడి విద్యార్థులతో అలంకార, వ్యాకరణశాస్త్ర చర్చలు, మధ్యమధ్యలో ఆశువుగా కవితలల్లడం, వానిని తాళపత్రాలపై ఘంటంతో వ్రాయడం, దండి, కాళిదాస, భవభూతి, బాణ, మయూర, హర్ష, మల్లినాథ, కల్హణాది కవుల రచనలు కూలంకష పరిశీలనా అధ్యయనం, వాల్మీకి వ్యాసమహర్షుల అమేయ రచనా పటిమను, ప్రకృతి జనిత వర్ణనా ప్రక్రియను ఆకళింపు చేసుకోవడంలోనూ నిమగ్నుడయ్యేవాడు. శంకరులు ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతముపై దృష్టి సారించేవాడు. ఆయన రచించిన శివానందలహరి అమిత భక్తితో పఠించేవాడు. కనకధారాస్తవము అతనికి కంఠోపాఠము.

పదిహేను వత్సరముల వయసులోనే జగన్నాథుడు రుద్రటుడు, వామనుడు, వాగ్భటుడు, న్యాయకౌశీకుడు, విశ్వనాథుడు, మమ్మటుడు ఆదిగాగల ఆలంకారికులను సునిశితంగా పఠించాడు. 'శబ్దము కావ్యమూ లేక శబ్దార్థము కావ్యమా!' అను సందేహమునకు లోనయ్యేవాడు. శబ్దమే కావ్యమని గాఢముగా విశ్వసించాడు. "రమణీయార్ధ ప్రతిపాదక శ్శబ్దః కావ్యమ్" అని అతని భావన

ప్రాకృత సంస్కృత భాషాపండితుడు – శాతవాహన చక్రవర్తి – హాలుడు జగన్నాథుని మనసు దోచిన కవిరాజు. ఆ రాజకవి సంకల్పించిన "ప్రాచీన గాథాసప్తసతి" ఆతని పెదవులపై నృత్యం చేసేది. ఆ రీతిలో ముక్తక కావ్యరచన చేయాలని జగన్నాథుడు ఉవ్విళ్ళూరేవాడు.

శ్రవణం, పఠనం, లేఖనం, మననం ఈ నాల్గు ప్రక్రియలు అతనికి బాల్యం నుండే పట్టుబడ్డాయి. దివారాత్రాలు సాహిత్య శాస్త్ర ప్రమేయమును మహాక్లేశమైననూ మననము చేసిన జగన్నాథుడు పేరుభట్టు యొక్క శిష్యశిక్షణా కౌశములతో నూనుగుమీసములనాడే భాసించాడు. అమేయ ప్రతిభాశాలిగా ఆకాశమంత ఎత్తు ఎదిగాడు. గొప్ప భావుకుడిగా రూపొందాడు. మీదు మిక్కిలి స్వాభిమానిగా నిరంతరం జ్వలించాడు.

*　　　　*　　　　*

ఒక సాయంకాలం గోధూళివేళ. పేరుభట్టు తన గృహానికి ముందుభాగాన ఉన్న ఆమ్రవృక్ష ఛాయలో ఆశీనుడయ్యాడు రెల్లుగడ్డితో చేసిన చదరపై. ఆయన చుట్టూరా చేరారు శిష్యులు ఏదైనా కొత్త విషయం నేర్చుకుందామని. వాళ్ళందరూ పదిహేను సంవత్సరాల వయస్సు పైబడినవారే. వారి రాకలోని ఆంతర్యం ఆచార్యునికి అవగతమైంది. వారందరూ పాండితీప్రకర్షలో కొన్ని సోపానాలు అధిరోహించినవారే. పేరుభట్టు పెదవులపై చిరునవ్వు వికసించింది. వారి సారస్వత ఆసక్తికి ముచ్చటపడ్డాడు.

"అద్భుత కవితాశక్తి సంబంధించినంత వరకు ప్రతిభ కారయిత్రి, భావయిత్రి అని రెండు విధాలు. కావ్యనిర్మాణ కౌశలం కారయిత్రి. కావ్య సౌందర్య రసస్పష్టి భావయిత్రి. ఈ విషయాన్నే కావ్యలోక మూర్ధాభిషిక్తుడు

అభినవ గుప్తుడు "సరస్వత్యాస్తత్వం కవి సహృదయాఖ్యం విజయతే" అని ఉల్లేఖించాడు. ఈ రెండు ప్రతిభలు సమానమైన పాళ్ళలో రంగరించి సాహితీసృజన చేసిన ఆ కావ్యం సాహితీప్రియుల హృదయసీమను తాకి ముద్దిడుకుంటుంది. వినీల నిర్మల గగన సీమలోని తారకల వలె ఆచంద్రార్కం మెరుస్తుంది. కాని అటువంటి అమేయ సృజన కవి కృషివలనే సాధ్యం. అటువంటి కవి సాహితీలోక మూర్ధాభిషుక్తుడై చిరస్థాయిగా కల్లోలిత సాగరంలోని దీపస్తంభంలా నిలబడతాడు. మీరు ఆ దిశగా కృషిచేయండి; అంటూ ఆ బృందంలో ఉన్న జగన్నాథుని వైపు దృక్కులు సారిస్తూ లేచాడు. కుమారుడు తండ్రిచెప్పిన మాటలు శ్రద్ధతో ఆలకించాడు. తండ్రి ఆకాంక్షను గుర్తించాడు. తండ్రి తనపై పెట్టుకున్న ఆశలు మరొక్కమారు తెలుసుకున్నాడు. ఈరోజు ఆయన ఇచ్చిన సందేశం ఆదేశంగా భావించాడు. ఆ దిశగా కృషి చేయుటలో ఆ క్షణమే దీక్షపూనాడు. అది అసిధారావ్రతమని ఆ యువకునికి తెలుసు.

* * *

అక్షరాభ్యాస దినం నుండి దాదాపు పదిహేను సంవత్సరాలు జగన్నాథుడు తండ్రివద్ద అవిచ్ఛిన్నంగా విద్యాభ్యాసం సాగించాడు.

జగన్నాథుడు ఎదుగుతున్నాడు. వయసురీత్యా మాత్రమేకాదు, పాండితీ ప్రకర్షణలో కూడా. అతడు గురువు వద్ద విద్యార్థి కాని ఇతర విద్యార్థుల సాహితీ చర్చలలో గురుస్థానం అతనిదే. అతనికంటే వయసులో అగ్రజులుండవచ్చు. కాని సాహితీవనంలో అతడే అగ్రజుడు. అతనికి పదిహేను సంవత్సరాలు. ఎత్తు ఆరు మూరలు మించడు. కాని సాహితీవనంలో ఏడు నిలువులు ఎదిగాడు.

ఒకరోజు పేరుభట్టు కార్యాంతరం మీద ప్రక్క గ్రామానికి వెళ్ళాడు. వెళ్ళేముందర శిష్యులను ఆదేశించాడు కావ్యరచనను గురించి చర్చించమని. చర్చవాడిగా జరుగుతోంది. విద్యార్థులు ఎవరితీరు వారు వివరిస్తున్నారు. చర్చ సమాప్తి అవుతోంది. అంతిమంగా జగన్నాథుడు లేచాడు.

"పద్యం రచించడం సులభమే. గణ, యతి, ప్రాసలను దృష్టిలో ఉంచుకొని పద్యం వ్రాయవచ్చు. ఆ ప్రక్రియ అభ్యాసం వలన అలవడుతుంది. కాని అందంగా వ్రాయటం అంత తేలిక కాదు. విస్తృతంగా కావ్యాలు చదివి అవి ఎందుకు అందంగా ఉన్నాయో తెలుసుకోవాలి. ఈ సందర్భంలో ఒక పద్యం గుర్తు చేసుకుందాం.

ఒకనాడు భోజునితో ఒక నేతకాడు, ఆతని భార్య తమ కవితలో ఈ సమస్యను చర్చించారు.

**కావ్యం కరోమి, నహి చారుతరం కరోమి**
**యత్నాత్కరోమి యది, చారుతరం కరోమి**
**భూపాల మౌళి మణిరంజిత పాదపీఠ!**
**హే సాహసాంక! కవయామి, వయామి, యామి.**

అని కవితను చెప్పాడు. దాని అర్థం కావ్యం రచిస్తాను. కాని అందంగా రచించలేను. ఒకవేళ ప్రయత్నం చేస్తే అందంగా రచించగలను. భూపాలుర తలలమీద ఉన్న మణుల, ఆభరణాలతో రంజితమైన పాదపీఠము కలవాడా! ఓ సాహసాంకా! కవిత్వం రచిస్తాను, నేతనేస్తాను, వెళ్తాను అని. 'భూపాల మౌళి మణిరంజిత పాదపీఠ' అనే పాదంలో శిల్పసౌందర్యం, భావ సౌందర్యం రెండూ ఉన్నాయి. రాజుల కిరీటాలలో ఎరుపురంగు మణులున్నాయి. వారు రాజు పాదపీఠంపై వంగిన ఆ రాజుల కిరీటాల యొక్క మణుల కాంతిలో పాదపీఠం రంజిత మవుతోంది. అనగా ఆ రాజులు భోజుని పాదాల మీద శిరస్సులు వంచి నమస్కరిస్తున్నాయని అంతర్లీనభావం. అద్భుతమైన ఈ ఊహను ఆ కవి దంపతులు వ్రాతలో సూటిగా చెప్పలేదు. అంతర్లీనంగా భావుకతతో మలిచారు. అదే శిల్పచాతుర్యం. ఇక 'సాహసాంక' పదం, ఆ రాజులు నమస్కరించడం అనే క్రియను తెలిపే సంబోధన.

మరి ఇక 'కవయామి', 'వయామి', 'యామి' అనే పదాలు. వానికి అర్థం: కవిత్వం వ్రాస్తాను, నేతవేస్తాను, వస్తాను అనికదా! ఒక పదంలోని అక్షరాలు తొలగించి క్రొత్తపదాలు ఎలా నిర్మించవచ్చునో ఆ నిర్మాణ కౌశలానికి ఉదాహరణలు.

ఇంతేకాదు మొదటి రెండు పాదాలలో కావ్య లక్షణం, మూడు నాలుగు పాదాలలో కావ్య లక్ష్యం ప్రతిబింబించాయి.

ఈ పద్యంలో వాడిన 'యత్నం' పదానికి అర్థం అభ్యాసం కాబట్టి అభ్యాసం వలననే అందంగా రచించడం సాధ్యపడుతుందని ఆ కవి దంపతులు అభిప్రాయం. కవితా రచనాభిలాషులకు ఈ పద్యం దీపస్తంభం" అని ముగించాడు.

అంతేవాసుల కరతాళ ధ్వనులతో గురుకులం మారుమ్రోగింది.

*    *    *

**– 3 –**

పేరుభట్టు కుమారునికి తనకు తెలిసిన సర్వవిద్యలు నేర్పాడు. హయగ్రీవ మంత్రం ఉపదేశించాడు. జగన్నాథుని శాస్త్రాధ్యయనం పూర్తి అయింది. అతనికి పదునెనిమిది సంవత్సరాలు నిండాయి. అది వివాహ వయస్సే. పేరుభట్టు ఆ గ్రామంలోని బాలిక కామేశ్వరి కుమారునికి సరియైన జోడు అని భావించాడు.

కామేశ్వరి, జగన్నాథులు బాల్యం నుండి కలిసిమెలిసి తిరిగినవారే. కామేశ్వరి తల్లిదండ్రులు పేరుభట్టుకు తెలిసినవారే. వారిది కూడా వైదిక సాంప్రదాయమే. సంపన్నులు కాకపోయినా ఆ గ్రామంలో వారికి గౌరవ మర్యాదలకు లోటులేదు. పైగా కామేశ్వరి చిన్ననాటి నుంచి లక్ష్మీదేవి కొంగుపట్టుకు తిరిగిన పిల్ల. ఆమెకు తన తల్లివద్దకంటే లక్ష్మీదేవి వద్దనే చేనువు ఎక్కువ. లక్ష్మీదేవికి ఇంటి పనులలో తోడ్పడుతూ ఉండేది. ఆమెతో గోదావరి స్నానానికి వెళ్ళేది. పూవులు కోసి ఇచ్చేది. మాలగా గ్రుచ్చేది. ఆమెతోటే భోజనం చేసేది. "అత్తా... అత్తా..." అని పిలుస్తూ బొంగరంలా తిరిగేది. అందాలుచిందించే ఆ బాలకు కూడా వివాహ వయస్సు వచ్చింది. లక్ష్మీదేవికి కామేశ్వరి అంటే అమితమైన ప్రేమ. జగన్నాథునికి సరియైన ఈడు, జోడు. ఆ బాలికకు కూడా పదునాలుగేళ్ళు పైబడ్డాయి. కాబట్టి పేరుభట్టు ఆలోచన తెలియగానే లక్ష్మీదేవి కామేశ్వరిని తన కోడలుగా చేసుకోవడం తమ ఇంటి భాగ్యంగా భావించింది. కామేశ్వరికి కూడా జగన్నాథుడంటే ఇష్టమే. వారిరువురూ ఆటపాటలలో కలిసిపోయిన వారేకదా!

అనుకున్నట్లుగా ఒక శుభముహూర్తాన కామేశ్వరి, జగన్నాథుల వివాహం జరిపించాడు పేరుభట్లు.

* * *

అది ఉమా మూలేశ్వరస్వామి దేవాలయము. సువిశాలమైనది. ఆలయ ముందుభాగాన పెరిగిన కదంబ తరుపుష్ప గుచ్ఛములు కుంకుమరేఖలను వెదజల్లుతున్నాయి. బిల్వ, అశోక, నేరేడు, మారేడు మహీజములతో ఆ ప్రాంగణము వనమువలె శోభిస్తోంది. ఆలయములోకి దారితీయు మార్గమునకు ఇరువైపులా ఉన్న మరువము, దమనము, మాచిపత్తిరి, మందార, జాజి, విరజాజి, చేమంతి, నందివర్ధనాలు కనువిందు చేస్తున్నాయి.

మనస్సును ఆహ్లాదపరచి, ప్రశాంతతను ఇచ్చే ఆ ఆలయము జగన్నాథునికి అత్యంత ప్రీతిపాత్రము. వికల మనస్కుడై ప్రశాంతతను కోరి జగన్నాథుడు ఆరోజు స్వామిని దర్శించడానికి వచ్చాడు.

గర్భగుడిలో ప్రవేశించి స్వామి ఎదుట నిలబడ్డాడు. ప్రాంజలి ఘటించాడు. ఫల, పుష్ప, పత్రాదులు సమర్పించాడు. అర్ఘ్యంతో అర్చించాడు. సాష్టాంగ దండ ప్రమాణ మాచరించి హృద్యముగా శంఖమునూదాడు కాంస్యగంటను సున్నితముగా మ్రోగించాడు. అర్చకుడొసగిన విభూతిని నొసట దాల్చి శివార్పిత తులసీ జలమును స్వీకరించాడు. నందీశ్వర విగ్రహము వద్దనున్న శిలాఫలకంపై పద్మాసనము వేసి శివధ్యానమున నిమగ్నుడయ్యాడు.

అపరాహ్ణమైనది. భక్తజనులు తమతమ ఇండ్లకు వెళ్ళిపోతున్నారు. జగన్నాథుడు కన్నులు తెరవలేదు. అర్చకునకు జగన్నాథుని దీక్షను భగ్నము చేయు ధైర్యము లేదు. అతడు తన దారిని తానుపోయెను.

ఇంతలో కామేశ్వరి అచటకు వచ్చింది. మెల్లగా భర్తను సమీపించింది.

“బావా! అత్త భోజనమునకు పిలుస్తోంది” ఆ మాటలు జగన్నాథునికి వీణియ మీటినట్లు వినిపించాయి. జగన్నాథుడు కన్నులు తెరిచాడు. అతని ముందర కామేశ్వరి నిలబడివుంది.

**You’ve Just Finished your Free Sample**

**Enjoyed the preview?**

**Buy: https://store.prowesspub.com**